క్లుప్తంగా

పరామర్శ

సీతానగరం: మండలంలోని జానుమల్లువలస గ్రామ వార్డు మెంబర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు వై.సత్యన్నాయుడు ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు మామిడి బాబ్జీ, మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు జానుమల్లు వలస వెళ్లి సత్యన్నాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు.

గాయపడిన విద్యార్థికి పరామర్శ


విద్యార్థిని పరామర్శిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పార్వతీపురం టౌన్: మండలంలోని డోకిశీల గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి కొండగొర్రి శంకరరావు ఈనెల 2వ తేదీన విద్యార్థులతో కలిసి ఆడుకుంటూ భవనం పైనుంచి జారిపడి గాయపడ్డాడు. వార్డెన్ రమేష్ విద్యార్థిని ఆ రోజే సమీపంలోని పీహెచ్‌సీకు తరలించి, ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్, సహాయ కార్యదర్శి హరికృష్ణ, నాయకులు వికాస్, తదితరులు ఆదివారం పరామర్శించారు. విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.

రోడ్డు నిర్మాణానికి చర్యలు


సర్వే చేయిస్తున్న డీఈఈ లోకనాథం

భామిని: మండలంలోని మూలగూడ నుంచి లివిరి సెంటరు వరకు రోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆదివారం సర్వే చేసి, రోడ్డు కొలతలు వేశారు. మొత్తం 2.6 కిలోమీటర్ల మేర రోడ్డును రూ.1.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నట్లు పంచాయతీ రాజ్ డీఈఈ డి.లోకనాథం తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ భాస్కరరావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని చెముడుగూడకు చెందిన మృతుడు నిమ్మల రమేష్ కుటుంబానికి హైదరాబాద్‌లో స్థిరపడిన గ్రామానికి చెందిన బుడంకాయల శ్రీనివాసరావు ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ఎం.దొరబాబు, టి.వినోద్‌లు బాధిత కుటుంబ సభ్యుల వద్దకు ఆదివారం వెళ్లి, దాత వితరణ చేసిన రూ.10 వేలను అందజేశారు. మండల కేంద్రంలోని హెచ్ గ్రౌండ్‌లో ఇటీవల జరిగిన గిరిజన సంప్రదాయ ఉత్సవమైన కందికొత్తలు పండగలో ప్రమాదవశాత్తు వేడి సాంబారులో పడి, రమేష్ మరణించిన విషయం తెలిసిందే.

నవోదయ మోడల్ టెస్ట్ రేపు

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7వ తేదీన నవోదయ మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు బి.బాలమోహనరావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఎం.ఎస్.చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగే ఈ పరీక్షకు రావాలనుకునే వారు మధ్యాహ్నం 12 గంటల్లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తొలి ఐదుగురికి బహుమతులతో పాటు నగదు బహుమతి, మధ్యాహ్న భోజనం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 7989929915ను సంప్రదించాలని కోరారు.


బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్


బైపాస్ కాలనీ వద్ద ప్రధాన రహదారి, దుకాణాల సముదాయం వద్ద చేతికి అందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్

ఇంత నిర్లక్ష్యమా..?

- పార్వతీపురం పట్టణంలో ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- చేతికందే ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకూ ఫెన్సింగ్ లేని వైనం
- ప్రమాదమని తెలిసినా పట్టించుకోని అధికారులు


వైకేఎం కాలనీలో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

పార్వతీపురంటౌన్: పట్టణ పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. రోడ్ల పక్కన, జనావాసాల మధ్యలో పిల్లలకు సైతం చేతికి అందే ఎత్తులో వీటిని ఏర్పాటు చేశారు. ఫెన్సింగ్‌లు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఉన్న గడ్డిని మేసేందుకు వెళ్లిన మూగజీవాలు విద్యుత్ షాక్‌తో మృతిచెందిన ఘటనలూ ఉన్నాయి. ఫ్యూజ్ బోర్డులు కూడా తక్కువ ఎత్తులోనే ఉన్నాయి. పిల్లలు ఆడుకుంటూ ఏమరపాటుగా అటువైపు వెళ్లి ప్రమాదం బారిన పడితే ఎవరిది బాధ్యత అని స్థానికులు విద్యుత్‌శాఖ అధికారులను ప్రశ్నిస్తున్నారు. రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లతో వాహన చోదకులకూ ఇబ్బందులు తప్పవని అంటున్నారు. పలు వీధుల్లోని ట్రాన్స్‌ఫార్మర్లకు తీగలు అల్లుకున్నాయి. చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు పెరగడంతో వాటి మధ్యలో అవి కనిపించడం లేదు. రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు.

వేరే ప్రాంతాలకు మార్చేందుకు చర్యలు

ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను విద్యుత్ శాఖ సిబ్బంది నిత్యం పరిశీలిస్తున్నారు. అవసరమైతే కొన్ని ట్రాన్స్ ఫార్మర్లను వేరే ప్రాంతాలకు మార్చేందుకు చర్యలు తీసుకుంటాం. కొన్నిచోట్ల సిమెంట్ దిమ్మెలు శిథిలావస్థకు చేరాయి. వాటి స్థానంలో కొత్త దిమ్మెలు, ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేసేందుకు అంచనాలు సిద్ధం చేస్తున్నాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

– ఎల్లంనాయుడు, పార్వతీపురం పట్టణ విద్యుత్‌శాఖ ఏఈ

పొంచి ఉన్న ప్రమాదం

పట్టణంలో వైకేఎం కాలనీ, ఎస్పీ ఆఫీసు దారి, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద, బైపాస్ రోడ్డుతో పాటు పలు మలుపుల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ప్రధాన రహదారికి ఆనుకుని ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రాత్రి వేళల్లో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ఇక అంతే సంగతులు. వాహనాలు ట్రాన్స్‌ఫార్మర్లను ఢీకొట్టే అవకాశం ఉంది. పిల్లలకూ వీటి వల్ల ప్రమాదం పొంచిఉంది.

– ఎం.సత్యంనాయుడు, వైకేఎం కాలనీ, పార్వతీపురం

గోదాదేవి అమ్మవారికి పల్లకీ సేవ


సీతానగరంలోని సువర్ణముఖి నదీ తీరాన ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగు తున్నాయి. అర్చకులు పి.శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో గోదాదేవి సమేత వేణుగోపాలస్వామివారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. గోవింద మాలధారణ భక్తులు గోదాదేవి అమ్మవారికి పల్లకీ సేవ చేశారు. వివిధ రకాల పూలతో అలంకరించిన పల్లకీలో అమ్మవారిని అధిష్టించి ఊరేగించారు. – సీతానగరం

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలకు భామిని నాయకులు

భామిని: కాకినాడలోని పీఆర్ కళాశాలలో జరిగే యూటీఎఫ్(ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్) స్వర్ణోత్సవాల మహాసభలకు మండల యూటీఎఫ్ నాయకులు శ్రీకాకుళం రోడ్డు(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ నుంచి శనివారం రాత్రి పయనమయ్యారు. ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరిగే సభల్లో పాల్గొని, యూటీఎఫ్ భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు. కాకినాడ వెళ్లిన వారిలో దండు ప్రకాశరావు, ఇ.తిరుపతిరావు, కె.ప్రసాద్ ఉన్నారు.

పశు పోషణలో జాగ్రత్తలు పాటించాలి


మేతకు వెళ్తున్న పశువులు(ఫైల్)

గరుగుబిల్లి: శీతాకాలంలో పశు పోషణలో యజమానులు తగిన జాగ్రత్తలు పాటించాలని రావివలస అసిస్టెంట్ పశువైద్యాధికారి ఎం.శ్రీరాములునాయుడు సూచించారు. ఇదే విషయమై ఆదివారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. కొన్నిరోజులనుంచి చలి తీవ్రత బాగా ఉందని, ఉష్ణోగ్రత తక్కువగా ఉంటే పశువులు ఒత్తిడికి గురవుతాయన్నారు. సాధారణంగా చల్లని వాతావరణంలో ఆవులు, గేదెలు పాలు తక్కువగా ఇస్తాయన్నారు. పాలదిగుబడి తగ్గకుండా ఉండడానికి రోజూ అందించే దాణాకు అదనంగా మరో 20 శాతం జోడించి పెట్టాలని తెలిపారు. అలాగే గాలి, సూర్యరశ్మి బాగా తగిలే ప్రదేశాల్లో పశువులను ఉంచాలన్నారు. పశువులు పడుకునే ప్రదేశం పొడిగా ఉండేలా చూడాలన్నారు. లేకపోతే శ్వాసకోశ సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. దూడలకు గోనెసంచులతో ఏర్పాటు చేసిన దుప్పట్లు కప్పాలన్నారు. ముఖ్యంగా చలికాలంలో పశువులకు మసూచి వ్యాధి సోకే అవకాశం ఉందని, గేదెల్లో కన్నా ఆవుల్లో ఈ వ్యాధి రావడానికి ఎక్కువ అవకాశం ఉందన్నారు. ఈ వ్యాధి బారినపడిన పశువుల పాదుగుపై పగుళ్లు ఏర్పడతాయన్నారు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

- ముగిసిన ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్


నూతనంగా ఎన్నికైన ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ

పార్వతీపురంటౌన్: ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రజాప్రతినిధులపై ఉందని, దాన్ని పక్కదారి మళ్లించి కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తూ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఏ.అశోక్ విమర్శించారు. స్థానిక ఏపీ ఎన్జీఓ హోంలో రెండు రోజులపాటు నిర్వహించిన ఎస్ఎఫ్ఐ పార్వతీపురం మన్యం జిల్లా 32వ మహాసభలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను కాపాడుకోవాలని, అందు కోసం సమరశీల పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యారంగానికి బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని, ఉపకార వేతనాల బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టళ్లలో మెస్ చార్జీలు నెలకు రూ.3వేలు పెంచాలని, జీఓ నెంబర్ 77 రద్దు చేసి పీజీ విద్యార్థులందరికీ స్కాలర్ షిప్ ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకం అక్షయ పాత్రకి ఇవ్వడం వల్ల విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందదన్నారు. ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులు, సంక్షేమ హాస్టళ్లలో వర్కర్లు, ఏఎన్ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, పాలకొండ, పార్వతీపురం, కురుపాంలో పీజీ సెంటర్లు నెలకొల్పాలని, సంక్షేమ పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలని, కురుపాం ఇంజినీరింగ్ కాలేజీ పనులు త్వరగా పూర్తి చేయాలని, పార్వతీపురంలో మెడికల్, ఐటీఐ కళాశాలు ఏర్పాటు చేయాలని పలు తీర్మానాలను ఆమోదించారు.

17 మందితో జిల్లా కమిటీ ఎన్నిక

మహా సభల ముగింపు సందర్భంగా 17 మందితో పార్వతీపురం మన్యం జిల్లా ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా టి.అఖిల్, కార్యదర్శిగా కె.రాజు, ఉపాధ్యక్షులుగా కె.డేవిడ్, హెచ్.సింహాచలం, సహాయ కార్యదర్శులుగా సంధ్య, సూర్యతో పాటు మరో 11 మందిని ఎన్నుకున్నారు. ఇతర ఉద్యమ అవసరాల రీత్యా డిపండు, పి.రాజశేఖర్‌లను ఎస్ఎఫ్ఐ నుంచి రిలీవ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ పతాకంతో నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రామ్మోహన్, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకుడు కె.రామస్వామి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తోట రమేష్, మానవ హక్కుల సంఘం నాయకులు వి.దాలినాయుడు, అపస్మా రాష్ట్ర యూనియన్ నాయకులు, శ్రీజన్ స్కూల్ కరెస్పాండెంట్ శ్రీనివాసరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.మన్మధరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి, గిరిజన సంఘం నాయకుడు పి.మోహన్‌రావు పాల్గొన్నారు.

నాడీ వ్యవస్థ వ్యాధులపై ఆర్ఎంపీలకు అవగాహన సదస్సు


సమావేశంలో మాట్లాడుతున్న న్యూరో సర్జన్ డాక్టర్ రెడ్డి శంకరరావు

పార్వతీపురంటౌన్: నాడీ వ్యవస్థ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం సభ్యుడు, న్యూరో సర్జన్ డాక్టర్ రెడ్డి శంకరరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ప్రకాశం టౌన్ హాల్‌లో నాడీ వ్యవస్థ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదడుకు స్ట్రోక్ రెండు రకాలుగా భావిస్తారని ఒకటి రక్తం సరఫరాలో అంతరాయం, రెండవది అధిక రక్తస్రావం జరగడం. రెండిటిలో నాలుగు గంటల వ్యవధిలో వైద్యం అందించినట్లయితే సాధారణ స్థితికి తీసుకురావచ్చన్నారు. బీపీ, మధుమేహం వంటి వ్యాధుల్లో మందులను అశ్రద్ధ చేయకూడదని తెలిపారు. సభ్యుల సంక్షేమం కోసం ఆగిన కమ్యూనిటీ పారామెడికల్ శిక్షణ తరగతులు పునఃప్రారంభించాలని ప్రభుత్వానికి కోరామన్నారు. తప్పనిసరిగా ప్రతి గ్రామీణ వైద్యుడు సంఘంలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా అధ్యక్షుడు గెద్ద చిరంజీవి, మన్యం జిల్లా ఇన్‌చార్జ్ అల్లాడ త్రినాథరావు, జోనల్ గౌరవ అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, మన్యం జిల్లా అధ్యక్షుడు జి.అప్పలనాయుడు, ఉపాధ్యక్షులు బి శంకర్రావు, పి. బాలకృష్ణ, విజయనగరం జిల్లా కార్యదర్శి కోట్ల పైడిరాజు, రాజాం డివిజన్ అధ్యక్షుడు చౌదరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి


సంజీవినాయుడు దంపతులను సన్మానిస్తున్న పశువైద్యాధికారులు, సిబ్బంది

సీతానగరం: ఏ రంగంలో అయినా ఉద్యోగి అందించిన సేవలే సమాజంలో వారికి ప్రత్యేక గుర్తింపునిస్తాయని పశుసంవర్ధక శాఖ సీతానగరం ఏడీ డాక్టర్ దీనకుమార్ అన్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన బూర్జ గ్రామీణ పశువైద్యాధికారి సంజీవినాయుడును స్థానిక పశుసంవర్ధక శాఖ ఏడీ కార్యాలయంలో శ్రీకాకుళం, ఉమ్మడి విజయనగరం జిల్లాల పశువైద్యాధికారులు, సిబ్బంది ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఏడీ దీనకుమార్ మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు, పదవీ విరమణ సహజమేనని అన్నారు. శ్రీకాకుళం పశుసంవర్ధక శాఖ మాజీ జేడీ మురళీధరరావు, విశ్రాంత డీడీ జగన్నాథం, విశాఖపట్నం డీడీ శంకరరావు, ఏడీలు ప్రసాదరావు, కె.వి.రమణ, చలపతిరావు, పశువైద్యాధికారులు ఎస్.రామారావు, చక్రవర్తి, సతీష్, సుధాకర్, గణేష్, గ్రామీణ పశువైద్యాధికారులు, పశుసంవర్ధక శాఖ సహాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ మోడల్ పరీక్షకు విశేష స్పందన


బహుమతులు పొందిన విద్యార్థులతో కరస్పాండెంట్ సరళకుమారి

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలిలో ఉన్న తిరుమల సాయి ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన జవహర్ నవోదయ మోడల్ పరీక్షకు విశేష స్పందన లభించింది. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని 17 మండలాల నుంచి మొత్తం 400 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఈ నెల 18వ తేదీన జరగనున్న జవహర్ నవోదయ పరీక్షలో మంచి మార్కులు పొందేందుకు ఈ పరీక్ష దోహదం చేస్తుందని పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ రౌతు వెంకటరమణ తెలిపారు. మోడల్ పరీక్షలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన మండంగి కార్తికేయ, బోనెల భారతి, పొట్నూరు చైత్రలకు కరస్పాండెంట్ సరళకుమారి చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అగ్నిఅస్త్రంతో కత్తెర పురుగు నివారణ

వంగర: ప్రకృతి సేద్యంలో భాగంగా తయారు చేసే అగ్నిఅస్త్రంతో మొక్కజొన్న పంటను ఆశించే కత్తెర పురుగును నివారించవచ్చని మరువాడ ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి ఆర్నిపల్లి సింహాద్రినాయుడు తెలిపారు. మండలంలోని కింజంగి గ్రామంలో అగ్నిఅస్త్రం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. సాగులో అధిక దిగుబడులకు ప్రకృతి సాగు విధానాలు అవలంబించాలని, రసాయనిక ఎరువులకు బదులు సహజ సిద్ధంగా తయారుచేసే కషాయాలను వినియోగించాలని ఆయన అన్నారు.

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామంలో అగ్నిఅస్త్రం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. ఏవో జి.మురళీకృష్ణ మాట్లాడుతూ మొక్కజొన్న పంటకు సోకే తెగుళ్ల నివారణకు ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే కషాయాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రకృతి సేద్యంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆరోగ్యవంతమైన పంట వస్తాయన్నారు. ప్రతిఒక్కరూ ప్రకృతి సేద్యం చేయాలన్నారు.

ఆ కొండకూర రుచే వేరయా!


గంధమొవ్వుకూర


తుమ్మికూర


సారికూర


చీపురుకూర

ప్రకృతి అందాల సమాహారం సీతంపేట మన్యం. ఎన్నో వింతలు, విశేషాలతో పాటు గిరిజన సంప్రదాయం అందరినీ కట్టిపడేస్తోంది. గిరిజన ఆచార వ్యవహారాలతో పాటు నోరూరించే వారి వంటకాలు ఎంతో విశేషంగా ఆకట్టుకుంటాయి. ముఖ్యంగా అక్కడి కొండకోనల్లో సహజంగా లభ్యమయ్యే కొండకూర(ఆకుకూరలు)ల రుచి ఇష్టపడని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. మనం తినే తోటకూర, గోంగూర మాదిరిగానే వారికి అంటూ ప్రత్యేకంగా ఆకుకూరలు ఉన్నాయి. వాటినే వారు కొండకూరలుగా పిలుచుకుంటారు. పోషకాలు, విటమిన్లు పుష్కలంగా లభించే ఆ కూరలను విడిగా ఓసారి.. వేరే కూరల్లో మిశ్రమంగా మరోసారి వండుకుని తింటుంటారు. గిరి శిఖర గ్రామాల్లోని గిరిజనులు మైదాన ప్రాంతాలకు వెళ్లి, కూరలు కొనుక్కొని వెళ్లాలంటే చాలా కష్టమైన నేపథ్యంలో ఇలా సహజంగా దొరికే కొండకూరలు వారికి ఆరోగ్యం తెచ్చిపెడుతుండడంతో పాటు ఆదాయం మిగుల్చుతుండడం విశేషం.

–సీతంపేట


అడవిలో సేకరించి, ఇంటికి తీసుకువస్తున్న ఆకుకూరను చూపిస్తున్న గిరిజనుడు


ముళ్లతోటకూర


కందముల౦కూర


బలుసుకూర